క్లుప్తంగా

యోగాతో ఒత్తిడి దూరం



యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గురువు అర్జున

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో యోగాతో ఒత్తిడి దూరం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ అధ్యక్షతన కాకినాడ అనుస్థాన యోగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు, యోగా గురువు కె.అర్జున విద్యార్థులకు ప్రాణాయామం, ధ్యానం తదితర అంశాలను వివరించి విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఈశ్వర్‌కుమార్, దాత వెంకట సుబ్బారావు

బోట్‌క్లబ్: స్థానిక పగడాలపేట మున్సిపల్ స్కూల్‌కు లయన్స్ అలైట్ క్లబ్ సభ్యులు గురువారం వాటర్ ప్లాంట్‌ను అందించారు. ప్లాంట్ దాతలు వింజమూరి వెంకటసుబ్బారావు, రాధామాధవి దంపతులను జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్ అభినందించారు. దాత వెంకట సుబ్బారావు, క్లబ్ అధ్యక్షుడు ఎంఎస్ఆర్‌వీ సత్యనారాయణలకు స్కూల్ హెచ్‌ఎం కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ సేవలకు అభినందనలు



ఎంపీడీవో సతీష్, ఏపీవో గణేష్‌లను అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, పీడీ వెంకటలక్ష్మి

కాకినాడ రూరల్: జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో 2024–25 సంవత్సరానికి వివిధ సూచీల కింద లక్ష్యసాధనలో ఉత్తమ కృషిచేసిన వివిధ మండలాల ఎంపీడీవోలను, ఏపీవోలను కలెక్టర్ షణ్మోహన్ సగిలి ప్రశంసించారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఉత్తమ ఫలితాలు సాధించిన కాకినాడ రూరల్ ఎంపీడీవో సతీష్, ఏపీవో విఘ్నేశ్వరను కలెక్టర్, డ్వామా పీడీ వెంకటలక్ష్మి అభినందించారు.

హానిమన్‌కు ఘనంగా నివాళి



హానిమన్ చిత్రపటానికి నివాళులర్పించిన వైద్యులు

బాలాజీచెరువు: హోమియో వైద్య పితామహుడు డాక్టర్ సీఎస్ఎఫ్ హానిమన్ 270వ జయంతిని గురువారం వెంకట్‌నగర్ గాయత్రి హోమియోవైద్యశాలలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా హోమియోపతి వైద్యుల సంఘ అధ్యక్షులు డాక్టర్ సలాది సూర్యకిరణ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో హానిమన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రస్తుత రోజుల్లో హోమియో వైద్యం మంచి ఫలితాలు ఇస్తోందని, వైరస్‌వంటి వాటిని నిర్మూలించడంతో పాటు మందులు వాడే విధానాన్ని వివరించారు. సీనియర్ హోమియోవైద్యులు ప్రస్తుత తరానికి మార్గదర్శకులుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్మోహనరావు, ఎంఎస్ఆర్ శాస్త్రి, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

బోట్‌క్లబ్: నూకాలమ్మ అమ్మవారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. కొత్త అమావాస్య ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెద్ద మార్కెట్ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 6 వేల మంది అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎం.మురళీవీరభద్రరావు పాల్గొన్నారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

కొత్తపల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 2 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మండల పౌర సరఫరాల అధికారి మమత తెలిపారు. మండలంలోని ఉప్పాడకు చెందిన చిత్రాడ బాబూరావు ఇంటిలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారని సమాచారం రావడంతో రెవెన్యూ, పోలీసుల సహకారంతో దాడి చేసి పట్టుకున్నారు. ఉప్పాడ గాంధీనగర్‌కు చెందిన దొరబాబు బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరకు విక్రయిస్తుంటాడు. నిల్వ ఉంచిన 2 టన్నుల బియ్యాన్ని, తూనిక యంత్రాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.


స్మార్ట్ సిటీకి.. ఇదో మచ్చ!

- పూడుకుపోయిన మురుగు కాల్వలు
- రహదారులపై పేరుకుపోయిన చెత్త
- నగరంలో కానరాని పారిశుధ్యం
- పెరుగుతున్న దోమలు
- ఫాగింగ్ చేపట్టని అధికారులు
- కంటి మీద కునుకు లేని ప్రజలు



గాంధీనగర్ ఒంటి మామిడి జంక్షన్ వద్ద చెత్త చెదారంతో నిండిపోయిన రహదారి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): దోమ పరిమాణంలో చిన్నదే కానీ అది కుట్టిందంటే ఎంతటివారైనా ఆసుపత్రి పాలవ్వాల్సిందే. మురుగు కాలువలు, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు, ముందుకు కదలని మురుగు వెరసి కాకినాడ నగరంలో దోమల ఉత్పత్తికి ఎన్నో కర్మాగారాలున్నాయి. చీకటి పడితే చాలు పుర ప్రజలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఇంటి తలుపులకు మెష్‌లు ఉన్నా ఏదో రకంగా ఇంటిలోకి చొరబడి దాడి చేస్తున్నాయి. ఇక ఆరు బయట ఒక్క క్షణం ఉండలేని పరిస్థితి. ఇప్పటికే ఉక్కపోత మొదలైంది. సాయంత్రం వేళల్లో చల్లగాలికి ఆరుబయట పడుకుందామంటే ఉండలేని పరిస్థితి నెలకొంది. దోమల నుంచి చిన్న పిల్లలు, వృద్ధులను కాపాడుకునేందుకు పట్టణ ప్రజలు పడుతున్న తిప్పలు అంతా ఇంత కాదు. వీటి నియంత్రణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఏ మాత్రం ప్రభావం చూపడం లేదు. ఇక ఇళ్లల్లో దోమల నివారణకు వాడే వివిధ రకాల చర్యలు అనారోగ్యానికి కారణమవుతున్నాయి. నగరంలో గాంధీ నగర్, రామారావు పేట, రామకృష్ణారావు పేట, టూటౌన్, భానుగుడి, శ్రీనగర్, అచ్యుతాపురం, విద్యుత్ నగర్, ఎల్విన్ పేట, కచ్చేరి పేట తదితర ప్రాంతాల్లో కాలువల్లో పూడికలు తీయక ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి దోమలు పెరుగుదలకు కారణం అవుతున్నాయి. కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఫాగింగ్ కంటి తుడుపు చర్యగా అక్కడక్కడా జరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేరుకే స్మార్ట్ సిటీ కానీ ఆ స్థాయిలో పారిశుధ్య నిర్వహణ చర్యలు కనపడడం లేదని నగర వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్కుల్లో సైతం సాయంత్రం అయితే దోమలు విపరీతంగా కుడుతూ ప్రశాంతత లేకుండా చేస్తున్నాయనే వాపోతున్నారు. ముఖ్యంగా మురుగు కాలువల్లో పూడికలు తీయక, వీధుల్లో చెత్త సరిగా తరలించకపోవడం వల్లే దోమల ఉత్పత్తి అంతకంతకూ పెరుగుతోంది. గత ఏడాది కంటే ఈ ఏడాది విపరీతంగా పెరిగి పోయాయంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత కార్పొరేషన్ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని దోమలు, మురుగు కాలువల్లో పూడికల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గాంధీనగర్ ట్రెజరీ బ్యాంక్ సమీపంలో పూడుకుపోయిన మురుగు కాలువ



మెయిన్ రోడ్డు డీబీఎస్ బ్యాంక్ సమీపంలో చెత్తతో నిండిన రహదారి



గాంధీనగర్ ఒంటి మామిడి జంక్షన్‌లో మరో ప్రాంతంలో నిండిపోయిన చెత్త కుండీలు

పూడికలు తీయాలి



మురుగు కాలువల్లో పూడికలు తీయక ఎక్కడి నీరు అక్కడే నిలచిపోయి దోమలు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా గాంధీనగర్ పార్కు పరిసర ప్రాంతాల్లో కాలువలు, ఎస్‌బీఐ ట్రెజరీ బ్యాంక్ పరిసర ప్రాంతాల్లో కాలువలు పూడికలు తీయక దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వస్తాయేమో అనే భయంతో బ్రతుకుతున్నాము. దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మణిరత్నం, గాంధీనగర్ వాసి

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి



బీఎల్‌ఓలు, వీఆర్వోలతో సమీక్షిస్తున్న ఆర్డీఓ మల్లిబాబు

కరప: ఓటర్ల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఆర్డీఓ ఎస్.మల్లిబాబు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం బీఎల్‌ఓలు, వీఆర్వోలతో ఆయన సమావేశమై సమీక్షించారు. ఓటర్ల నమోదు కోసం, చిరునామా మార్పులు, పేర్లలో సవరణ కోసం వచ్చిన దరఖాస్తులను నిర్దేశించిన ఫార్మాట్‌లో నమోదు చేయాలని, ఇతర విషయాలపై ఆర్డీఓ మల్లిబాబు అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఆర్ఐ పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ ప్రతినిధులు, తహసీల్దార్ల సమావేశం

కాకినాడ సిటీ: ఏపీ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యాన సంఘ ప్రతినిధులు, తహసీల్దార్ల సమన్వయ సమావేశం శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన కాకినాడ రెవెన్యూ భవనంలో ఈ సమావేశం జరుగుతుందని కాకినాడ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ఏపీ జేఏసీ అమరావతి సభ్య సంఘాల ప్రతినిధులు, మహిళా విభాగ ప్రతినిధులతోను, మధ్యాహ్నం 3 గంటలకు క్లాస్–4 ఉద్యోగులు, డ్రైవర్ల సమస్యలపై సమావేశం నిర్వహిస్తున్నామని వివరించారు.

అధికారుల వంతు సహకరించారు

- 'సాక్షి' కథనంపై స్పందించిన కలెక్టర్
- పొలాలకు నీరివ్వాలని అధికారులకు ఆదేశం
- హర్షం వ్యక్తం చేసిన రైతులు





వలసపాకలలో పొలాలను పరిశీలిస్తున్న ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు (అంతర చిత్రం) సాగునీరు వచ్చి తడిసిన పొలాన్ని చూపిస్తున్న రైతు

కరప: ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు కొంగోడు చానల్‌కు నీరు వదలడంతో వలసపాకలలోని పంటపొలాలకు సాగునీరు అందింది. సంపర బోది పరిధిలోని కొంగోడు చానల్‌కు 15 రోజులకు ఇవ్వాల్సిన వంతు 25 రోజులైనా ఇవ్వకపోవడంతో మండలం వలసపాకలలోని ఈనిక దశలో ఉన్న పంటపొలాలు నెర్రెలు తీశాయి. ఈ సమస్యపై సాక్షిలో 'చివరిలో సాగనీరూ..' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి జేడీఏ ఎన్.విజయకుమార్‌కు, ఇరిగేషన్ అధికారులకు సాగునీరు ఇచ్చేలా ఆదేశించారు. ఈ మేరకు గురువారం చింతపల్లి లాకుల వద్ద నీటి ప్రవాహం పెంచి, కూరాడ డ్యామ్ నుంచి కిందకు వదిలారు. దీంతో కొంగోడు చానల్‌కు సాగునీరు ప్రవహించి పంటపొలాలకు చేరింది. జేడీఏ సూచన మేరకు డీఈఈ పి.ఆనంద్‌కుమార్, ఏఈఈ నాగిరెడ్డి నాగభవాని, ఏఈఓ ప్రశాంత్‌లు వలసపాకలలో పర్యటించి పొలాలను పరిశీలించారు. అధికారులకు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా పట్టించుకోలేదని, సాగునీటి సమస్యపై 'సాక్షి'లో కథనం రావడంతో పరిష్కారం వచ్చిందని రైతులు హర్షం వ్యక్తంచేశారు.

సాక్షి ఇంపాక్ట్

చెట్టు తొలగించారు



సిరిపురం, వేళంగి గ్రామాల మధ్య రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న మామిడిచెట్టు

కరప: మండలంలోని సిరిపురం–వేళంగి రహదారిలో అడ్డుగా పడిన మామిడిచెట్టును అధికారులు గురువారం తొలగించారు. ఈ రహదారిలో ఐదు రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు ఆ చెట్టు అడ్డంగా విరిగి పడింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సమస్యపై సాక్షి దినపత్రికలో 'చెట్టును తొలగించండి' అనే శీర్షికన ప్రచురించిన చిత్ర కథనానికి గురువారం ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు స్పందించారు. రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టును తొలగించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. గ్రామ కార్యదర్శి దుర్గాభవాని గురువారం చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.



చెట్టును తొలగించిన తర్వాత సిరిపురం–వేళంగి రోడ్డు

జాతి నిర్మాణంలో బ్యాంకుల పాత్ర కీలకం



పెనుమర్తి బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఆర్ఎం బిజయ్ కేతన్ సాహు

కాకినాడ రూరల్: క్షేత్రస్థాయిలో ప్రభుత్వ లక్ష్యాలు విజయవంతం కావడానికి బ్యాంకులు ఎంతగానో దోహదపడుతున్నాయని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సీనియర్ ప్రాంతీయ మేనేజర్ బిజయ్ కేతన్ సాహు పేర్కొన్నారు. స్థానిక రమణయ్యపేటలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు పెనుమర్తి శాఖ ఆధునీకరణ అనంతరం బ్రాంచ్‌ను సాహు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల స్వయం శక్తి సంఘాలకు, వ్యవసాయానికి, గృహ నిర్మాణానికి, విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. చిన్న, మధ్య తరహా, సూక్ష్మ పరిశ్రమలు, ఉపాధి కల్పన వంటి పథకాలకు కూడా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తూ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నాయన్నారు. అలాగే జాతీయ బ్యాంకులలో డిపాజిట్లు చేయడం ద్వారా అధిక వడ్డీతో పాటు ప్రజాధనానికి భద్రత లభిస్తుందన్నారు. ఐఓబీ పెనుమర్తి బ్రాంచ్‌లో ఖాతాదారుల సౌలభ్యం కోసం సెంట్రల్ ఏసీతో పాటు సింగిల్ విండో ప్రవేశపెట్టామని సాహు తెలిపారు. ఈ సందర్భంగా కేతన్ సాహును ఖాతాదారులు ఘనంగా సత్కరించారు. బ్రాంచ్ మేనేజర్ బి.ఫణీంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, ఏజీఎస్ బి.శివ రామకృష్ణ, మేనేజర్లు కేవీవీ ప్రసాద్, రవికుమార్, శివ గణేష్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



గురజనాపల్లి హైస్కూలులో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

కరప: ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చైతన్యపరచాలని సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు అన్నారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ఫ్లెక్సీ, కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలసి గ్రామంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ వై.వీరవేణి, ఎస్ఎంసీ చైర్మన్ పి.నూకరాజు, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, హెచ్ఎంలు ఎం.సాయి మోహన్, కేవీ రమణి, యు.రాజీవ్‌కుమార్, వీవీ రమణమూర్తి, టి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్‌కే మున్సిపల్ హైస్కూల్ ఆధ్వర్యంలో

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక తిలక్ స్ట్రీట్‌లోని ఎస్ఎస్ఆర్‌కె మున్సిపల్ హైస్కూల్ ఆధ్వర్యంలో గురువారం వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి హెచ్ఎం ఎ.పుష్పగిరి ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ కె.సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రైమరీ విద్యార్థులకు హైస్కూల్‌లో జరిగే విద్యాబోధన, క్రీడలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సైన్స్, వివిధ విద్యా సంబంధ కార్యక్రమాలు వివరించారు. హెచ్ఎం పుష్పగిరి మాట్లాడుతూ ఆరో తరగతిలో చేరే విద్యార్థులకు విద్య అవశ్యకతను వివరించి పాఠశాలలో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఎంసీ కమిటీ చైర్మన్, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు 15 కేంద్రాలు

కరప: మండల పరిధిలో రబీ ధాన్యం కొనుగోళ్లకు 15 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, ఎంఏఓ ఏవీ రాజేష్ తెలిపారు. కరపలో గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. 15 రైతు సేవా కేంద్రాలలో వీటిని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో నియమించిన టెక్నికల్ అసిస్టెంట్, డాటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్, వీఏఏల పర్యవేక్షణలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాల మేరకు కనీస మద్దతు ధర కామన్ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2,300, 75 కిలోల బస్తాకు రూ.1,725 లు, గ్రేడ్–ఎ రకానికి క్వింటాల్‌కు రూ.2,320, 75 కిలోల బస్తాకు రూ 1,740 వంతున చెల్లించనున్నారు. రైతులు సొంతంగా గోనెసంచులు, హమాలీలను, రవాణా ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం నిర్ణయించిన రేటు రైతుల అకౌంట్లలో జమచేస్తారన్నారు. ధాన్యం విక్రయాల తర్వాత బయోమెట్రిక్ వేసి, తప్పనిసరిగా ఎఫ్‌టీఓ (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) రశీదు తీసుకోవాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, కనీస మద్దతు ధర పొందాలని తహసీల్దార్, ఎంఏఓలు కోరారు.

డాక్టర్ సలీమ్ మృతి



డాక్టర్ సలీమ్ (ఫైల్)

కాకినాడ క్రైం: జీజీహెచ్ సీఎంవోగా పని చేసి రిటైర్ అయిన డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ సలీమ్ (69) గురువారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందారు. కాకినాడ నరసన్న నగర్‌లో ఉంటున్న సలీమ్ కొద్ది కాలంగా కాలేయ సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లో ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కి సిద్ధం చేస్తున్న తరుణంలో ప్లేట్‌లెట్స్ పడిపోయి తీవ్ర అస్వస్థతకు గురై కొద్ది సేపటికే మృతి చెందారు. 2017లో జీజీహెచ్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ హోదాలో రిటైర్ అయిన సలీమ్ సీఎంవోగా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆర్ఎంవో, ఏడీ హోదాలలోనూ కొనసాగారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గురువారం ఉదయం మృతదేహాన్ని కుటుంబీకులు కాకినాడకు తీసుకు రాగా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుంచి పలువురు వైద్యులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జగన్ భద్రతలో ప్రభుత్వ వైఫల్యం


- పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత



పిఠాపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భద్రత విషయంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. గురువారం ఆమె పిఠాపురంలో మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ఏ నేతకూ లేని ప్రజాదరణ ఒక్క జగన్‌కే ఉందన్నారు. ఆయన ఎక్కడకు వెళ్లినా వేలల్లో జనసందోహం తరలి వస్తుండడం చూస్తుంటే అధికార పార్టీ వాళ్లే ఆశ్చర్యపోతున్నారన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రికి ఇవ్వాల్సిన భద్రత విషయంలో అనేక లోపాలు కనిపిస్తున్నాయన్నారు. హెలిప్యాడ్ల వద్ద జనాన్ని పోలీసులు నియంత్రించకపోవడమే దీనికి నిదర్శనమన్నారు. కొందరు అధికార పార్టీ నేతలు అవగాహన లోపంతో మాట్లాడుతు ఆయన ప్రతిపక్ష నేత కాదని ఒక ఎమ్మెల్యే అంటు వ్యాఖ్యానించడం చూస్తుంటే రాజకీయాలలో వారికి అవగాహన లేదని అర్థమవుతుందన్నారు. ఆయన ఒక మాజీ ముఖ్యమంత్రి అన్న విషయాన్ని మర్చిపోయి ఎమ్మెల్యే అంటు ఆయన స్థాయిని తగ్గించాలనుకోవడం వారి మూర్ఖత్వంగా అనిపిస్తోందన్నారు. ఎవరు ఆయన స్థాయిని తగ్గించాలని చూసినా జనం ఊరుకునే పరిస్థితి లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రికి తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మాజీ మంత్రికి ఇచ్చే భద్రత కూడా ఇవ్వకపోవడం ప్రభుత్వం నిర్లక్ష్యమే అవుతుందన్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో వైఎస్ జగన్‌కు భద్రత కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బోడకొండ
- ప్రజా సమస్యపై సీపీఐ పాదయాత్ర




సామర్లకోటలో ప్రజా సమస్యలపై సీపీఐ ప్రచార జాతా

సామర్లకోట: ప్రజా సమస్యలపై సీపీఐ పట్టణ నాయకులు గురువారం పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక విఘ్నేశ్వర థియేటర్ నుంచి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పెదిరెడ్ల సత్యనారాయణ అధ్యక్షతన ప్రచార జాతా ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ ముఖ్య అతిథిగా పాల్గొని గ్యాస్ సిలెండర్ ధర రూ.50, పెట్రోలు, డీజిల్ రూ.రెండు పెంచడం దారణమన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ పేదలకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, అర్బన్ ప్రాంతాల్లో రెండు సెంట్ల భూమి కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ. లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయాలి. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఫీజు భారాలు తగ్గించాలన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను బర్తీ చేయాలన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి తల్లికి వందనంతో పాటు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా నాయకుడు కేశవరపు అప్పలరాజు, నాయకులు పాల్గొన్నారు.



యాత్రికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న బ్యాంక్ సిబ్బంది

నూకాలమ్మతల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు



నూకాలమ్మతల్లి

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి భక్తులు గురువారం పోటెత్తారు. కొత్త అమవాస్యను పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ ఆర్. సౌజన్య ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సీఐ విజయ్ శంకర్ పర్యవేక్షణలో ఎస్ఐ మౌనిక బందోబస్తు కల్పించారు. స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చిరంజీవి ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు.